# వేదసారమే రామాయణం

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా!

"వేదవేద్యుడగు పరమాత్మ దశరథుని పుత్రుడుగా ఏరీతిగా జన్మించెనో అదేరీతిగా, సాక్షాత్తు వేదము వాల్మీకి మహర్షి ముఖతః రామాయణంగా ప్రకటితమయ్యెను"

ప్రేమస్వరూపులారా! సాక్షాత్ వేదమే దివినుండి భువికి దిగి వచ్చిన రామాయణం. వేదములు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం అనే నాల్గుభాగాలుగా ఉన్నాయి. రామాయణమునందు ఋగ్వేదమే రాముడు, యజుర్వేదమే లక్ష్మణుడు, సామవేదమే భరతుడు, అథర్వణ వేదమే శత్రుఘ్నుడు. నాల్గు వేదాలే ఈ నల్గురు సోదరుల స్వరూపాలు ధరించి దశరథుని ఇంట ఆడుకున్నాయి. ఋగ్వేద, యజుర్వేదములు యజ్ఞయాగాది క్రతువులకు సంబంధించిన మంత్రములతో కూడినవి. కనుకనే, విశ్వామిత్రుడు తన యాగసంరక్షణార్థమై రామలక్ష్మణులను తీసుకువెళ్ళాడు. రాముదరణ్యవాసం చేసిన పధ్నాలుగేళ్ళపాటు భరతుడు అయోధ్యను వదలిపెట్టి, నందిగ్రామంలో నివసిస్తూ, నిరంతరము రామనామాన్ని గానం చేస్తూవచ్చాడు. అందువల్లనే, భరతుణ్ణి సామవేదస్వరూపుడన్నారు. ఎక్కడ యజ్ఞయాగాది క్రతువులు జరుగుతుంటాయో, ఎక్కడ భగవన్నామస్మరణ జరుగుతుంటుందో అక్కడ భూతప్రేత పిశాచములు ప్రవేశించకుండా సంరక్షించేవాడు అథర్వణ వేదస్వరూపుడైన శత్రుఘ్నుడు. కనుక వేదము, రామాయణము వేరువేరని మీరు భావించరాదు. వేదసారమే రామాయణం. రామాయణంయొక్క స్వరూపమే వేదం.

మానవాభ్యుదయంకోసం ఆవిర్భవించినదే రామాయణం. మహాభారతం జరిగి ఐదువేల సంవత్సరాలు గడచిపోయినవి. దానికి పూర్వమే రామాయణం జరిగింది. ఇన్ని వేల సంవత్సరములు జరిగినప్పటికీ రామాయణం ఈనాటికీ మానవుని హృదయంలో చిరస్థాయిగా ప్రకాశిస్తున్నదంటే, రామాయణంయొక్క విశిష్టత, పవిత్రత ఎంత గొప్పవో మీరూహించవచ్చును.

sri sathyasai vachanamrutam

రామాయణంలో ప్రధానమైన సందేశములు రెండు – ఒకటి రామునిది, రెండవది రావణునిది. సత్యమే మానవునియొక్క స్వరూపం, ధర్మమే అతని స్వభావం. సత్యధర్మములే మానవుని నేత్రములు. ఇవే సకల శాస్త్ర స్వరూపములు. కనుక మానవుడు సత్యధర్మములను ఆచరించి, ప్రబోధించి తన జీవితాన్ని సార్థకం గావించుకోవాలని రాముడు జగత్తునకు చాటిచెప్పాడు. కాని రావణునికి సత్యధర్మములు రెండూ విరుద్ధములే. తాను సత్యము నంగీకరించడు, ధర్మము నాచరించడు. కనుకనే సర్వనాశనమయ్యాడు. చిట్టచివరికి తాను ప్రజలకు ఒక గొప్ప సందేశాన్ని అందించాడు. "ఓ ప్రజలారా! నేను కామానికి లోబడి కన్న కుమారులను కోల్పోయాను. వాంఛల నరికట్టుకోలేక నా వంశాన్ని నాశనం చేసుకున్నాను. రాగము నరికట్టుకోలేక నా రాజ్యమును భస్మం గావించుకున్నాను. కట్టకడపటికి నన్ను నేనే భస్మం గావించుకున్నాను. నేను సాధించినది ఏమిటి? అపకీర్తి మాత్రమే. కనుక మీరు నావలె సత్యధర్మములకు విరుద్ధంగా జీవించకండి. రామునివలె సత్యధర్మములను అనుసరించి సత్కీర్తిని సాధించండి" అన్నాడు.

## మంచిచెడ్డలు కలసియే ఉంటాయి

సత్కీర్తిని సాధించినవాడు రాముడు, అపకీర్తిని సాధించినవాడు రావణుడు. కీర్తి, అపకీర్తులు రెండూ జంటగా బయల్దేరుతుంటాయి. రాముడు లేకుండా రావణుడుగాని, లేక, రావణుడు లేకుండా రాముడుగాని ఉండటానికి వీలుకాదు. రామరావణ సంయోగమే రామాయణం. మంచిని చెడు ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. చంద్రబింబం వంటి తెల్లని ముఖము వెనుక ఉంగరములు తిరిగిన నల్లని ముంగురులున్నట్లుగా, ప్రకాశించే ధర్మము వెనుక అధర్మమనే అంధకారం ఉండనే ఉంటుంది. కనుక, మంచిచెడ్డలు రెండూ కలసియే ఉంటాయి. వీటిని విడదీయుటకు వీలుకాదు. మన ముఖమునకు, జుట్టుకు ఏవిధమైన సంబంధమున్నదో మంచిచెడ్డలకు అదేవిధమైన సంబంధమున్నది. రావణుడే లేకుండిన రాముని కీర్తి జగద్వ్యాప్తి కావటానికి వీలుకాదు. రామాయణంలోని ఇలాంటి అంతరార్థములను మీరు గుర్తించాలి.

sri sathyasai vachanamrutam

## 'ఎడ్యుకేర్' –'ఎడ్యుకేషన్'

రావణుడేమీ సామాన్యుడు కాదు. రాముడు చదివినంత చదువు రావణుడుకూడా చదివాడు. కాని, అతనిలో దుర్గుణములుండటంచేత ఆ చదువును ఆచరణలో పెట్టలేకపోయాడు; అది 'అజీర్ణరోగం'గా మారిపోయింది. రాముడు తాను చదివిన చదువును జీర్ణించుకొని, ఆచరణలో పెట్టి లోకాన్ని ఉద్ధరించాడు. చదువు రెండు రకాలు. ఒకటి బహిర్ముఖమైన చదువు, రెండవది అంతర్ముఖమైన చదువు. పుస్తకాల్లో ఉన్నది కంఠస్థం చేసి పరీక్షలలో వ్రాయటం బహిర్ముఖమైన చదువు. హృదయానందాన్ని, హృదయమాధుర్యాన్ని అనుభవింపజేసేది అంతర్ముఖమైన చదువు. దీనిని 'ఎడ్యుకేర్' అన్నారు. మీకు కేవలం 'ఎడ్యుకేషన్' మాత్రమే ఉంటే ప్రయోజనం లేదు; 'ఎడ్యుకేర్' కూడా కావాలి.

## రామాయణం బోధించే త్రివిధ ధర్మాలు

రామాయణమునందు మూడు విధములైన ధర్మములను ప్రబోధించాడు రాముడు. ఒకటి వ్యక్తిధర్మం, రెండవది కుటుంబధర్మం, మూడవది సాంఘిక ధర్మం. వ్యక్తి అనగా కేవలం ఆకారం కాదు. జగత్తునందు సామాన్యంగా మానవుని యొక్క ఆకారమునే వ్యక్తిగా భావిస్తారు. కాని రామాయణం బోధించిన వ్యక్తిధర్మం ఆకారమునకు సంబంధించినది కాదు. అవ్యక్తమై, నిగూఢమై, అంతర్భూతమై ఉన్న మానవత్వంయొక్క తత్త్వమే రామాయణం.

అంతర్భూతమైయున్న సత్యమును ప్రకటింపజేయునదే వ్యక్తిత్వం. హృదయస్థాయి యందున్న దివ్యత్వమును ప్రకటింపజేయునదే వ్యక్తిత్వం. వ్యక్తి అనగా ఆకారవ్యక్తి కాదు, ఆచరణ వ్యక్తి. ఇట్టి వ్యక్తిధర్మాన్ని ప్రపంచానికి చాటినవాడు రాముడు. పితృవాక్యపరిపాలన నిమిత్తం తాను అడవులకేగి అనేక బాధల ననుభవించాడు. కాని వాటిని తాను బాధలుగా భావించలేదు. ఇక్ష్వాకు వంశమువారు ఆడి తప్పనివారన్న కీర్తిని నిలబెట్టి కుటుంబధర్మాన్ని పోషించాడు. అరణ్యానికి బయల్దేరే ముందు తాను నారవస్త్రములు ధరించి తల్లియైన కౌసల్యయొక్క అనుమతి పొందాలని ఆమెవద్దకు వచ్చాడు. రాజ్యాభిషిక్తుడు కావలసిన కుమారుడు నారవస్త్రములు ధరించి రావటం చూసి కౌసల్య ఆశ్చర్యపడింది. రాముడు చిరునవ్వుతో "అమ్మా! ఈనాడు నా తండ్రి నన్ను అరణ్యానికి రాజుగా చేశాడు. ఈనాటినుండి నేను అరణ్యాన్ని

sri sathyasai vahini amrutam

పరిపాలించాలి. ఇది మన కుటుంబధర్మం" అన్నాడు. ఇంతలో లక్ష్మణుడు ప్రవేశించి క్రోధావేశంతో "అమ్మా! జరిగిన సంగతి ఇది కాదు. ఆ కైక మాటలు విని నాన్నగారు ఈ దుర్మార్గానికి పాల్పడ్డారు" అంటూ జరిగిన విషయాలను పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. "నేను రామాజ్ఞకోసం నిరీక్షిస్తున్నాను. రాముడు ఆజ్ఞ ఇచ్చిన క్షణంలో నేను వెళ్ళి ఆ మంథరను, కైకను హతమార్చి రామునికి పట్టాభిషేకం చేస్తాను. తండ్రిమాటను కూడా లెక్కచేయను" అన్నాడు.

లక్ష్మణుడీరీతిగా మాట్లాడుతుంటే రాముడు వెళ్ళి అతని నోరు మూశాడు. "లక్ష్మణా! ఈ దుర్మార్గం మన కుటుంబానికి తగినది కాదు. ధర్మాచరణయే మన కుటుంబలక్ష్యం. వ్యక్తిధర్మమును, కుటుంబ ధర్మమును మనం కాపాడాలి. లోకంలో కారణం లేని కార్యం జరగదు. కారణం లేక నాన్నగారు నాకీవిధమైన ఆజ్ఞ ఇవ్వరు. కనుక శాంతించు, శాంతించు" అన్నాడు. అప్పుడు కౌసల్య "రామా! కేవలం పితృవాక్యపరిపాలన మాత్రమే నీకు ప్రధానం కాదు. నేను దశరథుని అర్ధాంగిని, నీకు తల్లిని. కాబట్టి, నీవు నా కోరికనుకూడా నెరవేర్చాలి. నన్నుకూడా నీవెంట అరణ్యానికి తీసుకువెళ్ళు" అన్నది. అప్పుడు రాముడు "అమ్మా! ఇప్పటికే నా వియోగంచేత తండ్రి చాలా పరితపిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితిలో నీవు అతనిని వదలిపెట్టి నావెంట రావటం న్యాయం కాదు. నీవు అతని అర్ధాంగివి. అతనిని ఓదార్చి, అతనికి ఉపశమనం కల్గించటానికి ప్రయత్నించు. పతిని అనుసరించటమే సతికి ధర్మం. పతిని సేవించటమే నీ కర్తవ్యం," అన్నాడు. ప్రక్కనే ఉన్న సీత ఈ మాటలను విని "రామా! నీవు సమయానుకూలంగా ధర్మాన్ని బోధిస్తున్నావే! నేనుకూడా నీవెంట అరణ్యానికి వస్తానంటే, రాకూడదు వృద్ధులైన తల్లిదండ్రులకు సేవ చేయాలన్నావు. ఇప్పుడేమో సతికి పతియే దైవమనీ, పతిని అనుసరించటమే సతికి ధర్మమని నీ తల్లికి బోధిస్తున్నావు. మరి నాకు నా పతి దైవం కాదా? నాకొక ధర్మం, నీ తల్లికొక ధర్మం ఉంటుందా? కాబట్టి నేనుకూడా నీవెంట బయల్దేరుతున్నాను" అన్నది. అప్పుడు రాముడు సీత తన ధర్మాన్ని సరిగా గుర్తించిందని మెచ్చుకున్నాడు.

లక్ష్మణుడు కైకను తీవ్రంగా విమర్శించగా రాముడు అతనితో "లక్ష్మణా! ఆమెను నేను నా పినతల్లిగా భావించటం లేదు, నా స్వంతతల్లిగానే భావిస్తున్నాను. ఆమెకూడా భరతునికంటే

sri sathyasaivachanamrutam

నన్నే ఎక్కువగా ప్రేమించింది. అట్టి తల్లిని నీవు విమర్శించకూడదు. 'మాతృదేవో భవ, పితృదేవో భవ' కాబట్టి నేను తల్లులను గౌరవిస్తున్నాను. తండ్రిఆజ్ఞను శిరసావహిస్తున్నాను. ఇది మన కుటుంబధర్మం" అన్నాడు. ఈరీతిగా రాముడు ఆయా సమయసందర్భాలను పురస్కరించుకొని ధర్మాన్ని బోధిస్తూవచ్చాడు.

**రాముడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు**

అరణ్యంలో లక్ష్మణుడు శూర్పణఖ యొక్క చెవులు కోసినప్పుడు ఆమె వెళ్ళి తన సోదరుడైన రావణునికి రిపోర్టు చేసింది. రావణుడు అరణ్యానికి పెద్ద ఎత్తున రాక్షససైన్యాన్ని పంపించాడు. అప్పుడు రాముడు లక్ష్మణునితో చెప్పాడు – "లక్ష్మణా! నీవీ సమయంలో నేను చెప్పినట్లు చేయాలి. నా ఆజ్ఞయే నీకు ప్రధానమైనది. కనుక, మారుమాట్లాడక సీతను ఇక్కడినుండి వెంటనే తీసుకొనివెళ్ళు. మీరిద్దరూ ఏదైనా ఒక చిన్న గుహలో ఉండండి. నేనీ రాక్షసులను సంహరించి వస్తాను." కాని, లక్ష్మణుడందుకు ఏమాత్రం అంగీకరించలేదు. "అన్నా! ఇంతమంది రాక్షసులతో నీవు ఒంటరిగా యుద్ధం చేస్తుంటే, నేను నిన్ను విడిచిపెట్టి వెళ్ళగలనా? నీకు సోదరుడనైయుండి నేను చేయవలసిన పని ఇదేనా? కాదు, కాదు. సీతమ్మను కాపాడటంతోపాటు, నా సోదరుడవైన నీకు సహాయం చేయటంకూడా నా కర్తవ్యం. కాబట్టి, నేను నిన్ను విడిచి వెళ్ళను" అన్నాడు. అప్పుడు రాముడు "లక్ష్మణా! నిత్యజీవితంలో మానవునికి ఇలాంటి పరిస్థితులు ఎన్నో ఎదురౌతుంటాయి. సమయానికి తగినట్లు ధర్మాన్ని ఆచరించాలి. ఇంతమందే కాదు, ఇంకా ఎంతమంది రాక్షసులు వచ్చినా నేను వారిని ఒంటరిగా ఎదుర్కొని జయించగలనన్న సంగతి నీకు తెలుసు కదా! కాబట్టి నా ఆజ్ఞను శిరసావహించి సీతను కాపాడు" అని మంచి మాటలతో చెప్పాడు. ధర్మముయొక్క రహస్యాన్ని లక్ష్మణుని చెవిలో ఊదాడు. అప్పుడు లక్ష్మణుడు అంగీకరించి, సీతను ఒక సురక్షితమైన గుహకు తీసుకువెళ్ళాడు.

అరుపులు, మెరుపులతో యుద్ధం భయంకరంగా సాగుతోంది. ఆ శబ్దాలు విని లక్ష్మణుడు కొంత ఆందోళన చెందాడు. రాముణ్ణి ఒంటరిగా వదలివచ్చినందుకు సీత చీవాట్లు పెట్టి, తక్షణమే రామునికి సహాయంగా వెళ్ళమని అతనిని బలవంతం చేసింది. కాని లక్ష్మణుడు కదల్లేదు. "అమ్మా! నేను రామాజ్ఞను ఉల్లంఘించటానికి వీలుకాదు. రాముడు సర్వజ్ఞుడు,

srisathyasaivachanamrutam

సర్వశక్తిమయుడు. అతని శక్తిముందు నా శక్తి ఏపాటిది! రాముడు ఒంటరిగా పోరాడి ఎంతమంది రాక్షసులనైనా జయించగలడు" అని ఆమెను సమాధానపరచాడు. రాముని రాకకోసం ఇరువురూ వేయికళ్ళతో ఎదురు చూశారు. అక్కడ రాముడు సహస్ర శీర్షములతో కూడిన అస్త్రమును ప్రయోగించి రాక్షసులందరినీ నేలకూల్చాడు. రాముడు శత్రుసంహారం చేసి క్షేమంగా తిరిగి రావటం చూసి సీత, లక్ష్మణుడు చాలా ఆనందించారు.

ఒక్క రాముడు అంతమంది రాక్షసులను ఏరీతిగా నేలకూల్చాడు? రాముడు ఏకస్వరూపుడు కాదు, అనేకస్వరూపుడు. "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్..." అసలు అతని మోమును చూచిన తక్షణమే రాక్షసులంతా మూర్ఛపోయారు. లక్ష్మణుడు సీతతో "అమ్మా! సముద్రంలోని అలలనైనా లెక్కపెట్టవచ్చు. కాని రాముని శక్తిని వర్ణించుటకు వీలుకాదు. రామునియందు గుణాతీతమైన శక్తులున్నాయి. మేమందరమూ కేవలం నిమిత్తమాత్రులమే. సర్వశక్తిమయుడు రాముడు. రామనామముకూడా మహత్తరమైన శక్తితోకూడినది. అట్టి రామనామాన్ని మనం హృదయపూర్వకంగా ఉచ్చరిస్తే చాలు" అన్నాడు. రామనామమునందున్న మాధుర్యం వర్ణనాతీతమైనది.

**చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం**
**పెక్కిన తేనెకన్న అతిరుచ్యము నోటను పల్కపల్కగా**
**మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాన నిత్యమున్**
**చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్ !**

## ప్రవృత్తిధర్మం - నివృత్తిధర్మం

రామాయణంలోనున్న ధర్మములన్నీ వేదధర్మములే. ధర్మము రెండు విధములు. ఒకటి ప్రవృత్తిధర్మం, రెండవది నివృత్తిధర్మం. లోక సంబంధమైన ధర్మములన్నీ ప్రవృత్తిధర్మములు. "నాయనా! నీకు ఆకలైతే అన్నాన్ని భుజించు" అని చెబుతుంది ప్రవృత్తి. తక్షణమే నివృత్తి అడ్డుతగిలి "నాయనా! నీకు ఆకలౌతోందని చేతికి చిక్కినదల్లా తినవద్దు" అంటుంది. ఎలాంటి తిండి తినాలి? ఏరీతిగా తినాలి? అని బోధించేది నివృత్తిధర్మం. మనస్సును వికల్పం చేసేది ప్రవృత్తి, హృదయాన్ని కరిగించేది నివృత్తి. బాహ్యమైన చర్యలకు సంబంధించినది ప్రవృత్తి.

srisathyasaivachanamrutam

ఈనాడు మీరు లోకంలో కంటితో చూసేది, చెవులతో వినేది, మనస్సుతో అనుభవించేది అంతా ప్రవృత్తికి సంబంధించినదే. మనస్సుకు, ఇంద్రియాలకు అతీతమైన తత్త్వమే నివృత్తి. అట్టి నివృత్తిమార్గమును బోధించాడు రాముడు. ఇదియే వేదముయొక్క ప్రధానమైన సూత్రం. రాముడు దశరథుని కుమారునిగా పుట్టాడు. కాని, అతడు దశరథుని కుమారుడు కాదు, కౌసల్యగర్భంలో పుట్టలేదు; అగ్నిహోత్రంలో పుట్టినాడు. కనుక, రామతత్త్వం ప్రాకృతసంబంధమైనది కాదు; ఇది మనస్సుకు, బుద్ధికి అతీతమైన తత్త్వం.

## మంథర పూర్వజన్మ వృత్తాంతం

కైకకు రాముడంటే అత్యంత ప్రీతి. కైక తన స్వంత కుమారుడైన భరతునికంటే రాముడినే అత్యంత ప్రేమతో చూసేది. కాని, మధ్యలో మంథర ఎవరు? ఒక పర్యాయం కైకేయి తండ్రియైన కేకయరాజు వేట నిమిత్తం అడవికి వెళ్ళినప్పుడు ఒకచోట అతనికి ఆడ, మగ జింకలు రెండు ఆడుకొంటూ కనిపించాయి. వెంటనే కేకయరాజు మగజింకను బాణంతో కొట్టాడు. ఆడజింక ఏడ్చుకుంటూ తన తల్లిదగ్గరకు వెళ్ళి "అమ్మా! ఈ కేకయరాజు నా భర్తను హతమార్చాడు. ఇప్పుడు నా గతి ఏమిటి?" అన్నది. అప్పుడా తల్లిజింక కేకయరాజుదగ్గరకు వచ్చి "రాజా! భార్యాభర్తలను విడదీయటం మంచిది కాదు. నీవు మహారాజువైయుండి ఇలాంటి పనికి పూనుకోవటం న్యాయం కాదు. ఇప్పుడు నీవు చేసిన పనియే నీ జీవితంలో అశాంతికి కారణమౌతుంది. నేనేవిధంగా నా అల్లుని మరణంతో బాధపడుతున్నానో అదేవిధంగా, నీవుకూడా నీ అల్లుని మరణంతో బాధపడతావు. దానికి నేనే కారణమౌతాను" అన్నది. ఆ జింకయే మంథరగా పుట్టి, దశరథుని మరణానికి కారకురాలై, కేకయ రాజుకు దుఃఖాన్ని కల్గించింది. ఈవిధంగా విచారణ చేస్తే వేదశాస్త్ర పురాణము లందు ఇట్టి ప్రమాణాలు అనేకంగా కనిపిస్తాయి. వేదశాస్త్రపురాణములు అవినాభావసంబంధం కల్గినవి. అవి అన్యోన్యాశ్రయములు. అది వేరు, ఇది వేరు అని వాటిని విభజించటానికి వీల్లేదు.

## దుర్జనుల స్పర్శకూడా చాలా ప్రమాదకరం

మంథరకు పాతసంకల్పం మనస్సులో ఉంది. దశరథునిపై లేనిపోని చాడీలు చెప్పి, అతనిపట్ల కైకకు గల ప్రేమను చెడగొట్టాలని ఆమెకు బుద్ధి పుట్టింది. ఇంతలో దశరథుడు

srisathyasaivachanamrutam

శ్రీరామ పట్టాభిషేక శుభవార్తను కైకకు తెలియజేయటానికి మేళతాళాలతో ఊరేగింపుగా వస్తున్నాడు. గుఱ్ఱములు సకిలిస్తున్నాయి, ఏనుగులు ఘీంకరిస్తున్నాయి, మంగళవాయిద్యాలు వినిపిస్తున్నాయి. ఈ శబ్దములు ఎక్కడినుండి వస్తున్నాయో చూద్దామని గూని మంథర భవనంపైకి ఎక్కి చూసింది. దశరథుడు ఊరేగింపుగా రావటం కనిపించింది. రాజు ఇంత వైభవంగా ఉండటం ఆమెకిష్టం లేదు. క్రిందికి దిగి వస్తుంటే కౌసల్య చెలికత్తె ఒకామె ఎదురు వచ్చింది. ఆమె కౌసల్య తనకిచ్చిన పట్టువస్త్రాలను, ఆభరణాలను ధరించి వాటిని కైకకు చూపించాలని వస్తోంది. మంథర "ఏమిటి నీవింత అలంకారం చేసుకొని వస్తున్నావు? ఎవరిచ్చారు నీకివన్నీ?" అని అడిగింది. తన కుమారుడైన రాముడు రాజుగా పట్టాభిషిక్తుడు అవుతున్నాడన్న ఆనందంతో కౌసల్య తన దాసీలందరికీ పట్టువస్త్రాలను, నగలను బహూకరించిందని ఆమె చెప్పింది. ఈ మాటలు వినగానే మంథరకు అసూయ కల్గింది. తనకు కూడా ఇవ్వనందుకు ఆమెకు కోపం వచ్చింది.

వెంటనే లోపలకు ప్రవేశించింది. ఆ సమయంలో కైక చాలా ఆనందంగా అలంకారం చేసుకుంటోంది. మంథర "కైకా! ఏమి నీ వైభవం? ఏమిటీ అలంకారం? ఎందుకోసం చేసుకుంటున్నావు?" అని అడిగింది. కైక ఆమె మాటలను లెక్క చేయలేదు. దగ్గరకు వెళ్ళి "కైకమ్మా! రాజుకు నీవంటే చాలా ప్రేమ అని భావిస్తున్నావు. అది కపటప్రేమ. ఆ ప్రేమను నమ్మి నీవు మోసపోతున్నావు. ముస్ముందు నీ పరిస్థితి చాలా దిగజారిపోనున్నది. చూడు, నా మాట విను" అంటూ ఆమెభుజంపై సున్నితంగా కొట్టింది. ఆ స్పర్శచేత ఆమెలో ఉన్న దుర్భావాలు కైకలో ప్రవేశించాయి.

కనుక దుర్గుణములు గలవారితో మనం ఎప్పుడూ చేరకూడదు. వారి స్పర్శకూడా మనకు చాలా ప్రమాదం తెప్పిస్తుంది. అంత వరకు రాముణ్ణి ఎంతగానో ప్రేమించిన కైక ఆ క్షణంలో అతనికి విరోధిగా మారిపోయింది. అసూయకు మారుపేరైన మంథర తన దుర్బోధలతో ఆమె మనస్సును పాడుచేసింది. అసూయ అనే పెనుభూతం పట్టినవారెవ్వరూ బాగుపడరు. కనుకనే, నేను అప్పుడప్పుడు చెబుతుంటాను - "త్యజ దుర్జన సంసర్గం." దుర్గుణములు గలవారితో సహవాసం చేయకూడదు. మీ ప్రాణం పోయినా సరే, అసూయాపరులతో స్నేహం



srisathyasaivachanamrutam

చేయకూడదు.

**రెండు వరాలు**

దేవాసుర యుద్ధసమయంలో దశరథునియొక్క రథచక్రపు సీల విరిగిపోగా, ఆ స్థానంలో కైక తన వ్రేలిని పెట్టి చక్రం ఊడిపోకుండా కాపాడింది. ఆమె చేసిన సహాయానికి మెచ్చి దశరథుడు ఆమెను ఏవైనా రెండు వరాలు కోరుకొమ్మన్నాడు. కైక తనకప్పుడు ఎట్టి కోరికలూ లేవనీ, అవసరం వచ్చినప్పుడు తప్పక అడుగుతాననీ అన్నది. దశరథుడు ఆమె ఏది కోరినా తీర్చగలనని వాగ్దానం చేశాడు. మంథర కైకకు ఈ సంఘటనను జ్ఞాపకం చేసి "వాటిని ఈనాడు కోరవచ్చు కదా!" అన్నది.

మంథర తెలివితేటలకు సంతోషించి కైక ఆ సమయంలో ఏ వరాలను కోరుకోవాలో ఆమెనే చెప్పమంది. ఆనాటి నియమముల ననుసరించి, పన్నెండు సంవత్సరములు దాటిన అనుభవము గలవానికే హక్కులు చెల్లునన్న శాసనమును గుర్తించి, రాముణ్ణి పధ్నాల్గు సంవత్సరములు అరణ్యానికి పంపాలనీ, కుమారుడైన భరతునికి పట్టాభిషేకం చేయాలనీ కోరుకొమ్మన్నది. "కైకా! దశరథ మహారాజు వస్తున్నాడు. ఈలోగా కోపగృహంలో ప్రవేశించు. నీ నగలన్నీ తీసి చెల్లాచెదురుగా పారవేసి, వాడిపోయిన పూలతీగలా నేలపై వ్రాలిపో" అన్నది. ఆమె మాటల ననుసరించి కైక కోపగృహంలో ప్రవేశించింది.

దశరథుడు వచ్చి "ఎక్కడ కైక?" అని అడిగాడు. ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. చివరికి మంథరే చెప్పింది "మీరే ఒక్కసారి లోపలికి వెళ్ళి చూడండి" అని. దశరథుడు లోపలికి వెళ్ళి అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి భయభ్రాంతులకు లోనయ్యాడు. నగలన్నీ నేలపై చెల్లాచెదురుగా పడియున్నాయి. "కైకా! ఎందుకీవిధంగా నటిస్తున్నావు?" అన్నాడు. జవాబు లేదు. "ఈనాడు రామపట్టాభిషేకం అత్యంత వైభవంగా జరుగబోతున్నది. నా జీవితంలో ఇది చాలా ఆనందకరమైనరోజు. ఇలాంటి శుభదినమున నీవీవిధంగా విచారించటం మంచిది కాదు. నీకేమి కావాలో అడుగు. సుందర భవనములైనా సరే, బంగారు నగలైనా సరే, ఏది కావలసినా నేనిస్తాను" అని ప్రమాణం చేశాడు. కైక తనకివన్నీ అక్కర్లేదన్నది. నెమ్మదిగా తన కోరికలను వ్యక్తపరచింది. ఆ కోరికలను విని దశరథుడు మూర్ఛిల్లాడు. తరువాత తేరుకొని

sri sathyasai vachanamrutam

"కైకా! ఎందుకు నీకింత అసూయ? ఇది లోకంలో నీకు చెడ్డపేరు తెప్పిస్తుంది. ఇది నీకు మంచిది కాదు" అని ఎంతగానో నచ్చజెప్పాడు. కాని కైక తన పట్టును వీడలేదు.

ఇంక ఆలస్యమైపోతున్నదని రాముడు వచ్చాడు. పచ్చని పట్టు వస్త్రములు ధరించి, పట్టాభిషేకమునకు సిద్ధమై తల్లిదండ్రులకు నమస్కారం చేయటానికని వచ్చాడు. అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి చాలా బాధపడ్డాడు. కైకను కారణమడుగగా ఆమె జవాబు చెప్పలేదు. మంథరే అన్నీ చెప్పింది. "ఆనాడు నీ తండ్రి వరమిచ్చాడు. ఈనాడు ఆడినమాట తప్పుతున్నాడు" అన్నది. రాముడు తండ్రి దగ్గరకు వెళ్ళి "తండ్రీ! ఏదేమైనా సరే, నీవు ఆడిన మాట తప్పకూడదు. ఆడిన మాట తప్పితే మన ఇక్ష్వాకు వంశానికే అపకీర్తి వస్తుంది. కాబట్టి నీవు అంగీకరించు, నేను అరణ్యానికి వెళతాను" అన్నాడు.

వెంటనే మంథర నారవస్త్రాలను తెచ్చి రాముని ఎదుట పడవేసింది. అసూయ ఇలాంటి పనులకు ఎప్పుడూ సంసిద్ధంగానే ఉంటుంది. రాముడు అక్కడే నారవస్త్రాలను ధరించాడు. వెళ్ళేముందు తండ్రికి నమస్కారం చేశాడు. కాని, దశరథుడు స్పృహ లేకుండా పడియున్నాడు. అప్పుడు కైక "రామా! తల్లి వేరు, తండ్రి వేరా నీకు? తల్లిగా నేను ఆజ్ఞాపిస్తున్నాను. తక్షణమే నీవు అరణ్యానికి వెళ్ళాలి" అంది. రాముడు ఆమె ఆజ్ఞను శిరసావహించి అరణ్యానికి బయల్దేరాడు.

**'మంథర' ఈనాటికీ సజీవంగానే ఉన్నది!**

దుర్గుణములన్నింటిలోనూ అసూయ చాలా చెడ్డది. అసూయచేతనే లోకం మూడు భాగములు చెడిపోతున్నది. అందంగా ఉన్నవారిని వికారంగా చేయటం.... ఫస్ట్ క్లాసులో పాసయ్యేవారిని పాడుచేయటం... ఈరీతిగా బాగున్నవారిని చెడగొట్టటమే అసూయయొక్క పని. రామాయణంలో రావణుడు మరణించాడుగాని, మంథర ఈనాటికీ మరణించలేదు. అసూయ అనే మంథర ఇప్పటికీ సజీవంగానే ఉన్నది. ఈ 'మంథర'ను మరణింపజేసేవారు ఎవ్వరూ లేరు. దీనిని లెక్కచేయకుండా ఉండటమే మనం చేయవలసిన పని.

చెడ్డ మాటలు చెప్పకూడదు, చెడ్డ మాటలు వినకూడదు, చెడ్డ పనులు చేయకూడదు. ఇదే రామాయణం అందించే ప్రధానమైన ఆదర్శం. చెడ్డ మాటలు చెప్పింది మంథర; చెడ్డ మాటలు విన్నది కైక. వారి గతి ఏమైపోయింది? ఈనాడు లోకంలో స్త్రీ లెవరైనా మంథర లేక

sri sathyasai vachanamrutam

కైక అని పేరు పెట్టుకుంటున్నారా? కౌసల్య పేరు పెట్టుకుంటారు గాని, కైక పేరుగాని, మంథర పేరుగాని ఎవ్వరూ పెట్టుకోరు. చెడ్డ చూపులు చూశాడు కీచకుడు. తత్ఫలితంగా భీముడు అతని తల పగలగొట్టాడు. ఈనాడు మగవారిలో ఎవరైనా కీచకుని పేరు పెట్టుకుంటున్నారా? ఎవ్వరూ పెట్టుకోరు. చెడ్డ మాటలు చెప్పినవారిని, చెడ్డ మాటలు విన్నవారిని, చెడ్డ చూపులు చూసినవారిని నిరసిస్తుంది లోకం.

**నామస్మరణ, హృదయపవిత్రత**

ఒకానొక సమయంలో హనుమంతుని తల్లియైన అంజనాదేవి కౌసల్య గృహానికి వచ్చింది. "అమ్మా! మీరెవరు?" అని కౌసల్య అడిగింది. "అమ్మా! పెద్ద సముద్రాన్ని ఒక్క ఉదుటున లంఘించిన మహావీరుడైన హనుమంతుని తల్లిని నేను" అని ఆమె జవాబిచ్చింది. కొద్దిసేపటికి అగస్త్యుని తల్లి కూడా అక్కడకి వచ్చింది. "అమ్మా! మీరెవరు?" అని కౌసల్య ప్రశ్నించగా "అమ్మా! సముద్రాన్నంతటినీ ఒక్క గుటకలో మ్రింగిన అగస్త్యుని తల్లిని నేను" అని సమాధానమిచ్చింది. అప్పుడు కౌసల్య "మీ కుమారులు అంతటి ఘనకార్యాలు సాధించినది నా కుమారుని నామమహిమచేతనే కదా" అన్నది. ఇంతలో రాముడు ప్రవేశించి "అమ్మా! ఇది నా నామమాహాత్మ్యం కాదు, వారి హృదయ పవిత్రతయే దీనికి మూలకారణం. ఎంతమంది నా నామాన్ని ఉచ్చరించటం లేదు? కాని, అందరూ ఇట్టి ఘనకార్యాలు సాధించగల్గుతున్నారా? కాబట్టి, కేవలం నామాన్ని స్మరిస్తే ప్రయోజనం లేదు. హృదయపవిత్రతకూడా ఉండాలి" అన్నాడు.

పవిత్రత, శాంతం, పట్టుదల - ఈ మూడూ ఉన్నవారు ఎవరైనా దైవసమానులే, సాక్షాత్తు బ్రహ్మస్వరూపులే. మంచి విషయాలలో పట్టుదల ఉండాలి. ఎన్ని కష్టములెదురైనా శాంతంగా ఉండాలి. పేరు ప్రతిష్ఠలకోసం ప్రాకులాడకూడదు. హృదయాన్ని పవిత్రంగా ఉంచుకోవాలి. ఇదే మీరు చేయవలసిన సాధన.

రామాయణం అనేక ఆదర్శాలను అందిస్తోంది. రామాయణం జరిగి ఎన్నో వేల సంవత్సరాలు గడచిపోయినప్పటికీ అన్ని దేశములవారు, అన్ని భాషలవారు ఇప్పటికీ రామాయణాన్ని గౌరవిస్తున్నారు. రామాయణంలో ఉన్న పవిత్రతయే దీనికి కారణం. ఎప్పటికప్పుడు నూతనోత్తేజము నందిస్తుంది రామాయణం. మీరెన్నో సంవత్సరముల నుండి

sri sathyasai vachanamrutam

రామనవమి పండుగను జరుపుకుంటున్నారు; ప్రసాదం స్వీకరిస్తున్నారు; పానకం త్రాగుతున్నారు. కాని, మీలోని దుర్గుణాలను పోగొట్టుకుంటున్నారా? లేకపోతే పండుగలు చేసుకొని ప్రయోజనమేమిటి? పండుగలను చేసుకున్నందుకు మీ హృదయం మధురమైన పండువలె తయారుకావాలి.

విద్యార్థులారా! మీది లేత వయస్సు. సమాజమనే రైలులో మీరు చాలా దీర్ఘ ప్రయాణం చేయవలసినవారు. పెద్దవారు రాబోయే స్టేషన్లోనో, ఆ తరువాతి స్టేషన్లోనో దిగిపోతారుగాని, మీరు మాత్రం దీర్ఘ ప్రయాణం సల్పవలసినవారు. కనుక, మీ 'కంపార్టుమెంటు'ను పరిశుద్ధంగా పెట్టుకోండి. సుఖంగా ప్రయాణం చేయండి. ఆత్మతత్త్వాన్ని తెలుసుకోండి. అనుగ్రహఫలాన్ని అందుకోండి. రాముణ్ణి హృదయంలో ప్రతిష్ఠ చేసుకొని, రామనామాన్ని హృదయపూర్వకంగా స్మరించుకుంటూ మీ జీవితాన్ని సార్థకం గావించుకోండి. రాముడు ప్రతి హృదయమునందు ఆత్మస్వరూపుడై యున్నాడు. కనుకనే అతనికి ఆత్మారాముడనే పేరు వచ్చింది. ఆత్మయే బ్రహ్మస్వరూపం. కనుక "అహం బ్రహ్మాస్మి" అనే విశ్వాసాన్ని పెంచుకోండి.

రామ రామ రామ సీతా
రామ రామ రామ సీతా
శ్రీమద్రవికులమందు జనించి
సీతాదేవిని ప్రీతి వరించి
ప్రేమనహల్యా శాపము దీర్చి
ప్రియభక్తుల రక్షించిన శ్రీరఘు ॥రామ రామ॥
ఖరదూషణాది దనుజుల ద్రుంచి
కరుణ జటాయువు గతి సవరించి
శరభంగాది మునీంద్రుల బ్రోచి
శబరి ఫలములు ప్రేమ భుజించిన ॥రామ రామ॥
రావణాది సురవైరుల ద్రుంచి
రమణితోడ సాధుల పాలించి



sri sathyasai vachanamrutam

దేవతలెల్ల నుతింపగజేసి
దేవిగూడి పురిజేరిన శ్రీరఘు ॥రామ రామ॥
నిజ సహోదరులు నిను సేవింపగ
నిన్ను గొల్చి ప్రజలెల్ల సుఖింపగ
అజహరాది సురలెల్ల నుతింపగ
ఆనందముతో అయోధ్య నేలిన ॥రామ రామ॥

నీనీనీ

రామా కోదండరామా రామా పట్టాభిరామా
రామా కల్యాణరామా రాఘవా...
రామా సీతాపతి రామా నీవే గతి
రామా నీకు మ్రొక్కితి రామా నీ చేజిక్కితి ॥రామా॥
రామా నాకెవరు తోడు రామా క్రీగంట చూడు
రామా నేను నీవాడు రామా నాతో మాటాడు ॥రామా॥
రామా నీదొక్కమాట రామా నాకొక్క మాట
రామా నీ పాటే పాట రామా నీ బాటే బాట ॥రామా॥
రామా నామమే మేలు రామా చింతనే చాలు...

(02-04-2001 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)

sri sathyasai vachanamrutam